బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 05 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4

## ప్రాజెక్టులకు ప్రముఖుల పేర్లు..

బలగం టీవీ, హైదరాబాద్

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి దివంగత కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని తెలంగాణ మంత్రి మండలి నిర్ణయించింది. సింగూరు ప్రాజెక్టుకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే రాజనర్సింహా పేరు పెట్టాలని మంత్రివర్గ సమావేశం ప్రతిపాదించింది. జూరాల నుంచి కృష్ణా జలాలను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఆయకట్టుకు సాగునీరందించేందుకు ఉన్న మార్గాలు, ప్రత్యామ్నాయాలను పరిశీలించేందుకు సాంకేతిక నిపుణుల కమిటీని నియమించాలని కూడా మంత్రిమండలి నిర్ణయించింది. ఇప్పుడున్న ప్రాజెక్టులకు మరింత నీటిని తీసుకునే సాధ్యాసాధ్యాలపై ఈ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది. ఈ నివేదిక ప్రకారం పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వీలైనన్ని ఎక్కువ భూములకు నీరందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ మహానగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు గోదావరి డ్రింకింగ్ వాటర్ పంపిణీ పథకం ఫేజ్-2, ఫేజ్ 3కు మంత్రిమండలి ఆమోద ముద్రవేసింది. గతంలో 15 టీఎంసీలకు ప్రతిపాదించిన ఈపథకాన్ని భవిష్యత్ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీలను పెంచేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

## జమ్ముకశ్మీర్‌లో లోయలో పడ్డ వాహనం



### నలుగురు సైనికుల మృతి

బలగం టీవీ, హైదరాబాద్

జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు సైనికులు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. పహారా కాసేందుకు వెళ్తున్న ఓ సైనిక వాహనం బందిపొరాలోని వులార్ వ్యూపాయింట్ వద్ద అదుపుతప్పి లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు సైనికులు మృత్యువాత పడగా.. మరొకరికి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలిలోనే ఇద్దరు జవాన్లు మృతి చెందగా.. క్షతగాత్రులను బందిపొరా జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు శ్రీనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మరో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు. వారం రోజుల క్రితం పూంఛ్ జిల్లాలోనూ ఇదే తరహా ప్రమాదం జరిగింది. జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం గరోవా ప్రాంతంలోని 300 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మంచు ఎక్కువగా కురుస్తుండటం వల్ల రోడ్డును అంచనా వేయలేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.



# ఎకరాకు రూ.12 వేల రైతు భరోసా

- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని పేదలకు రూ.12వేలు
- రేషన్ కార్డుల్లేని వారందరికీ కొత్త కార్డులు
- 26 నుంచి ఈ మూడు పథకాలు అమలు
- సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

బలగం టీవీ, హైదరాబాద్

నూతన సంవత్సరంలో తెలంగాణ రైతాంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ ఎకరాకు 12 వేల చొప్పున రైతు భరోసా చెల్లించాలని నిర్ణయించినట్టు చెప్పారు. అలాగే వ్యవసాయ భూములు లేని రైతులకు సంవత్సరానికి 12 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని, దానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంగా నామకరణం చేసినట్టు చెప్పారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం జరిగింది. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.

రైతు భరోసా చెల్లింపు, భూమిలేని వ్యవసాయ దారులను ఆర్థికంగా ఆదుకోవడం, రేషన్ కార్డు లేని వారికి కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయడం వంటి కీలకమైన మూడు అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ మూడూ జనవరి 26 నుంచి అమలులోకి వస్తాయని చెప్పారు. "అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ కొత్త సంవత్సరంలో తెలంగాణ రైతాంగానికి మంచి జరగాలి. వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలి. వ్యవసాయం దండగ కాదు. పండుగ చేయాలని తమ ప్రభుత్వం పట్టుదలతో ఉంది. రైతు భరోసా విషయంలో రైతాంగంలో రకరకాలుగా గందరగోళం సృష్టిస్తున్నారు. ఆ గందరగోళాన్ని దూరం చేస్తూ రైతులకు శుభవార్త చెప్పాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం.

వ్యవసాయయోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా పథకం కింద నిధులను ఇవ్వడం జరుగుతుంది. గత ప్రభుత్వం రైతుబంధు కింద ఏటా 10 వేలు ఇస్తే, మా ప్రభుత్వం ప్రజా పాలనలో రైతులందరికీ సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించాం. భూమి ఉన్న రైతులకు రైతు భరోసా పథకం కింద సహాయం అందించడమే కాకుండా తండాలలో గూడాలలో మారుమూల పల్లెల్లో ఉన్న భూమి లేని వ్యవసాయ రైతు కుటుంబాలకు ప్రతి ఏటా 12 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ పథకానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అని నామకరణం చేశాం.

చాలా సంవత్సరాల నుంచి రేషన్ కార్డుల సమస్య పేదవారిని పట్టి పీడిస్తోంది. అందుకే రేషన్ కార్డు లేని అందరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. ఈ పథకాలన్నీ జనవరి 26 వ తేదీ రిపబ్లిక్ దినోత్సవం నుంచి ప్రారంభమవుతాయి. ఆరోజుకు ఒక ప్రత్యేకత ఉంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి రాజ్యాంగం అమలు లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 26 నుంచి ఈ పథకాలన్నింటినీ అమలు చేయాలని నిర్ణయించాం.

వ్యవసాయానికి యోగ్యం కాని భూములు, అంటే రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు రైతు భరోసా వర్తించదు. ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా సమాచారాన్ని సేకరించి గ్రామ సభల ద్వారా ప్రజలకు వివరిస్తారు. ధరణి లోపాల కారణంగా గతంలో కొంత మందికి ఆ రకంగా కూడా రైతు బంధు కింద నిధులు అందాయి. కాబట్టి దయచేసి అలాంటి వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రభుత్వానికి వివరాలు అందించడం ద్వారా సహకరించాలి.

ప్రభుత్వానికి ఉన్న ఆర్థిక వెసులుబాటును దృష్టిలో పెట్టుకుని 10 వేల నుంచి 12 వేల రూపాయలకు పెంచాం. భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు కూడా 12 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రభుత్వానికి ఉన్న ఆదాయ వనరులు, ప్రభుత్వ ఆదాయం పెంచడం, పేదలకు పంచడం ప్రభుత్వ విధానం. ఎంత వెసులుబాటు ఉంటే అంత వెసులుబాటు మేరకు రైతులకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచన."

## గ్రామీణ భారత మహోత్సవాన్ని ప్రారంభించిన ప్రధాని



బలగం టీవీ, హైదరాబాద్

దేశ అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని, అటువంటి గ్రామాల అభివృద్ధిని గత ప్రభుత్వాలు విస్మరించాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. దిల్లీలో నిర్వహించిన 'గ్రామీణ భారత మహోత్సవం 2025' కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. వెనకబడిన వర్గాలైన ఓబీసీ, ఎస్టీ, ఎస్సీలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, అందుకే గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు ఎక్కువ య్యాయని అన్నారు. దీనితో సహజంగానే పట్టణాల్లోనూ పేదరికం పెరిగిపోయిందని వాపోయారు. సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్నా గ్రామాలకు, పట్టణాలకు మధ్య ఉన్న అంతరం పెరుగుతూనే ఉందని ప్రధాని ఆవేదన వ్యక్తంచేశారు.

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు ప్రస్తుతం తమ పాలనలో సమాన హక్కులు పొందుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. సమాజ సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, పాటిస్తున్న విధానాలు గ్రామీణ భారతంలో కొత్త శక్తిని నింపుతున్నాయని ప్రధాని చెప్పారు. మారుమూల గ్రామాల ప్రజలను దేశ అభివృద్ధిలో భాగం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి సమ్మిళిత ఆర్థిక విధానాలు అవసరమని ప్రధాని పేర్కొన్నారు.

కొవిడ్ సమయంలో భారత్‌లోని మారుమూల ప్రజలు ఆ మహమ్మారిని ఎలా ఎదుర్కొంటారని ప్రపంచ దేశాలు అనుమానం వ్యక్తంచేసినట్లు మోదీ పేర్కొన్నారు. కానీ తమ ప్రభుత్వం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుందని మోదీ అన్నారు. డిజిటల్ టెక్నాలజీ సహాయంతో దేశంలోని అత్యుత్తమ వైద్యులు, ఆసుపత్రులను గ్రామాలకు అనుసంధానించామని వెల్లడించారు. గ్రామాలలోని ప్రజలు ప్రస్తుతం టెలీమెడిసిన్ సౌకర్యాలను సైతం పొందుతున్నారన్నారు. పల్లెల్లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు, మౌలిక వసతులు అందిస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పీఎం-కిసాన్ పథకం కింద కేంద్రం రైతులకు రూ.3 లక్షల కోట్ల ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల మూలంగా గ్రామీణ భారతంలో పేదరికం దాదాపు 26 శాతం నుంచి 5 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ డీఎన్ఏలోనే మోసం



- కేంద్ర మంత్రి బండి సంజయ్

బలగం టీవీ, హైదరాబాద్

దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, ఆ తరువాత ప్రజలను దారుణంగా మోసం చెయ్యడం కాంగ్రెస్ డీఎన్ఏ లోనే ఉందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరుతో రైతులకు ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం దుర్మార్గం అని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 'కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం' పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలకు, ఈనాడు సీఎం చేసిన ప్రకటనకు పొంతనే లేదు. ప్రతి రైతుకు, కౌలు రైతుకు ఎకరానికి రూ.15 వేలు చొప్పున, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా సొమ్ము చెల్లిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ నేడు అందుకు భిన్నంగా రూ.12 వేలు మాత్రమే ఇస్తానని ప్రకటించడం అంటే రైతులను దగా చేయడమే%-% అని పేర్కొన్నారు.

ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. అయినా ఏడాది రైతు భరోసా చెల్లించకుండా ఎగ్గొట్టారు. ఆలస్యమైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారని, గత ఏడాది చెల్లించాల్సిన బకాయి కూడా చెల్లిస్తారని ఆశించిన రైతులకు పూర్తి నిరాశే ఎదురైంది. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరుతో రైతు భరోసా బకాయి చెల్లించకపోగా, ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన రైతు భరోసా హామీకి సైతం తూట్లు పొడిచి ఇందిరమ్మ అభయ హస్తమంటే భస్మాసుర హస్తం అని నిరూపించారుఅని బండి సంజయ్ చెప్పారు.

కౌలు రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలకు సైతం రైతు భరోసా ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ కూలీలను పూర్తిగా విస్మరించడం అన్యాయం అని బండి సంజయ్ అన్నారు. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఎంత మంది రైతులకు ఎంత మొత్తాన్ని చెల్లిస్తారు? అట్లాగే ఎంత మంది కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా సొమ్ము చెల్లిస్తారో ప్రకటించకపోవడం విడ్డూరం. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరుతో రైతు బంధు లబ్దిదారుల సంఖ్యలో భారీగా కోత విధించాలనుకుంటున్నదని ఆరోపించారు. ఇప్పటికే రుణమాఫీ పేరుతో కోతలు పెట్టారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని, సన్న వడ్లకే బోనస్ పరిమితం చేశారు. అది కూడా కొంత మంది రైతులకే బోనస్ చెల్లించారు. 46 లక్షల మంది

మిగితా 2వ పేజీలో

## సినిమాల పేర్లు తెలుగులో ఉంటే బాగుంటుంది

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

సినిమాల పేర్లు తెలుగులో ఉంటే బాగుంటుందని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. మాట్లాడటం, రాయడం ద్వారానే భాషను పరిరక్షించగలమని అభిప్రాయ పడ్డారు. హైదరాబాద్‌లో కొనసాగుతున్న తెలుగు మహాసభల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలతో ప్రతి రోజూ బాల సాహిత్యం చదివించాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ విభాగంలో తెలుగు భాష క్రోడీకరించి భావితరాలకు అందించాలని సూచించారు. డిజిటల్ రంగంలో మాతృ భాష అభివృద్ధి, సంరక్షణకు దోహదం చేయాలని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి పేర్కొన్నారు. వికీపీడియాలో తెలుగు వ్యాసాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. కథలు, వ్యాసాలు ఆడియో రూపంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తెలుగు కనుమరుగు కాకముందే పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. బోధనా భాషగా ప్రాచుర్యంలోకి తేవాలని చెప్పారు. పాలన, అధికార వ్యవహారాలు మాతృభాష తెలుగులో జరగాలన్నారు. కొత్త సాంకేతికత, కార్యక్రమాలను మాతృభాషలోనే చేపట్టాలని సూచించారు. వాడుక భాషలో 30 శాతమే తెలుగు ఉందని.. దాదాపు 70 శాతం ఆంగ్ల పదాలే ఉంటున్నాయన్నారు.

మనకు తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి ఉందని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక స్థాయి వరకు మాతృభాషలో విద్య



ఉండాలని అభిప్రాయపడ్డారు. కేంద్రం తెచ్చిన కొత్త విధానాన్ని అమలు చేయాలని.. ప్రాంతీయ భాష పరిరక్షణకు పెద్దల సహకారం కావాలని చెప్పారు. న్యాయస్థానాల్లో వాదనలు, ప్రతివాదనలు తెలుగులో ఉండాలని.. కోర్టు తీర్పులు, సినిమాల పేర్లు తెలుగులో ఉండాలని చెప్పారు. అన్ని భాషల్లోకెల్లా తెలుగు భాష మధురమైనదని.. ఆ భాషను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

కాగా హైటెక్‌సిటీలోని హెచ్‌సీసీ కాంప్లెక్స్, నోవాటెల్ కన్వెన్షన్ హాల్‌లో అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి. జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు ఈ మహాసభలు జరగనున్నాయి. ఈ సభలకు దేశవిదేశాలకు చెందిన 2 వేల మందికిపైగా ప్రతినిధులు పాల్గొంటారు. శుక్రవారం నాటి కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాష అభివృద్ధికి పాటుపడుతున్న పలువుర్ని సత్కరించారు.

## ఆరు గ్యారంటీల గురించి ప్రశ్నిస్తే..
## ఆరు కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు..



- సీఎం అంటే ఇప్పుడు కటింగ్ మాస్టర్.
- రాజన్న సిరిసిల్లలో కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

ఆరు గ్యారంటీల గురించి ప్రశ్నిస్తే.. ఆరు కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. పర్రె మేడిగడ్డకు పడలేదు.. రేవంత్ పుర్రెకు పడ్డదని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో కాంగ్రెస్సే ఏదో దొంగచాటుగా చేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఏడాది స్థానిక సంస్థల ఎన్నికల సంవత్సరం కాబోతోంది.. కాబట్టి ప్రేక్షకపాత్రకు పరిమితం కావదవ్దని బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. కేసులకైనా భయపడకండి అని.. చిట్టినాయుడు ఏం పీకలేడని ఎద్దేవా చేశారు. చిల్లర మల్లర రాతలు రాయించేవారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. బాక్సింగ్‌లో కిందపడ్డా నిలబడి కొట్లాడేటోడే వీరుడు అని చెప్పారు. కాంగ్రెస్ 8, బీజేపీ 8 ఎంపీలు అయ్యారని కానీ కేంద్రం నుంచి వచ్చింది మాత్రం గుండు సున్నా అని విమర్శించారు.

చిన్న చిన్న తప్పిదాలతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఒక రోజు దేశంలో చక్రం తిప్పే రోజు ముందుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ నాడు బీఆర్ఎస్ ప్రభుత్వానికి రూ.369 కోట్ల రెవెన్యూ మిగులుతో అప్పజెప్పితే.. మనం దిగిపోయేనాడు రూ. 5 వేల 564 కోట్ల మిగులుతో కాంగ్రెస్‌కు అప్పజెప్పామని తెలిపారు. రెవెన్యూ మిగులు విషయంలో ముఖ్యమంత్రిదో మాట.. ఉప ముఖ్యమంత్రిదో మాట ఉందని విమర్శించారు.

పదేళ్లలో రూ. 4 లక్షల 17 వేల కోట్లు మనం అప్పు చేస్తే.. కాంగ్రెస్ ఒక ఏడాదిలో రూ. 1 లక్షా 37 వేల కోట్ల అప్పు చేసిందని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ చేసిన అప్పుల వల్ల జరిగిన అభివృద్ధి గురించి మేం చెప్తాం.. మీ అప్పులతో ఏం జరిగిందో మీరు చెప్పగలరా అని నిలదీశారు. ఈ ప్రభుత్వం హైడ్రా పేరిట పేదల పొట్ట కొట్టడం తప్ప ఏం చేసిందని ప్రశ్నించారు. పైసలన్నీ ఢిల్లీకి పంపుతున్నారని అన్నారు. ఢిల్లీకి తెలంగాణ ఏటీఎం అయిపోయిందని విమర్శించారు. కోటి ఆరు లక్షల మంది నుంచి దరఖాస్తులు తీసుకుని ఏం చేసినట్టు? మళ్ళీ ఈ రైతు ప్రమాణ పత్రాలెందుకు అని ప్రశ్నించారు.


ఆరు గ్యారంటీల గురించి ప్రశ్నిస్తుంటే.. తనను ఆరు కేసుల్లో ఎలా ఇరికిద్దామా అని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కేటీఆర్ విమర్శించారు. కొడంగల్ భూములివ్వని కేసులో కూడా తనను ఇరికించే యత్నం చేశారని తెలిపారు. ఆయన కేసుల గురించి ఆలోచిస్తుంటే.. మనం రైతుల గురించి ఆలోచిద్దామని తెలిపారు. త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించి, బూత్ కమిటీ నుంచి రాష్ట్ర కమిటీలు వేసుకుందామని తెలిపారు. రైతు భరోసాపై గ్రామాల్లో నాయకులంతా చర్చ పెట్టాలని సూచించారు.

## నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సిద్ధం

- ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్

బలగం టీవీ, హైదరాబాద్

'చెరుకు రైతుల చిరకాల వాంఛ అయిన నిజాం చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉంది. రైతులు చెరుకు సాగుకు ముందుకొస్తే ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తాం. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని పునరుద్ధరింపజేసేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నాం. ఈ ప్రాంత రైతుల ప్రయోజనాల కోసం నిజాం షుగర్స్‌ను తెరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఖ్యమంత్రికి సూచించగా, ఆయన సానుకూల వైఖరితో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఫ్యాక్టరీకి



సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.190 కోట్లను ప్రభుత్వం చెల్లించింది' అని ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్ వెల్లడించారు. నిజాం షుగర్స్‌ను పున్ణప్రారంభించే చర్యల్లో భాగంగా శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి శివారులోని సరయు ఫంక్షన్ హాల్‌లో స్థానిక శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో చెరుకు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు.

మిగితా 2వ పేజీలో

## హైడ్రా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

- ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని హైడ్రా కమిషనర్ నిర్ణయం
- ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తామని వెల్లడి
- మధ్యలో 2 నుంచి 3 గంటల వరకు బ్రేక్!

బలగం టీవీ, హైదరాబాద్

హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. ఈ మేరకు సమస్యలను పరిష్కరించేందుకు హైడ్రా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయం బుద్ధ భవన్‌లో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఈ గ్రీవెన్స్ సెల్ ఎల్లుండి (జనవరి 6) నుంచి ప్రారంభం కానుండగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు భోజన విరామంతో మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుంది. ప్రజలు తమ ఫిర్యాదులతో పాటు సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామని హైడ్రా కమిషనర్ తెలిపారు. ఫిర్యాదుతో పాటు పూర్తి వివరాలు అందజేయాలని సూచించారు. హైడ్రా గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదులపై ఏమైనా సందేహాలు ఉంటే 040 - 29565758, 040-29560596 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## మరో కళాశాలలో వాష్ రూంలో కెమెరాలు..!

- మహబూబ్ నగర్ జిల్లాలోని పాలిటెక్నిక్ కాలేజీలో ఘటన
- ఆందోళన చేపట్టిన విద్యార్థులు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బలగం టీవీ, హైదరాబాద్

మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బాలికల బాత్రూంలో మొబైల్ కెమెరాల ఘటన కలకలం సృష్టించింది. తమకు రక్షణ కల్పించాలని విద్యార్థినులు ఆందోళనకు దిగారు. పోలీసులకు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో కెమెరా కలకలం సృష్టించింది. ఈ కాలేజీలోని గర్ల్స్ టాయిలెట్‌లో మొబైల్ కెమెరాను పెట్టారు. తమ వాష్‌రూంలో మొబైల్‌తో వీడియోలు రికార్డ్ చేస్తున్నట్లు గుర్తించిన విద్యార్థినులు నేడు కాలేజీ ఎదుట నిరసనకు దిగారు. ఈ ఘటనకు బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆందోళనకు పలు విద్యార్థి సంఘాలు మద్దతు పలికాయి. విషయం తెలియడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. విచారణ జరిపిన పోలీసులు నిందితుడిని గుర్తించారు. వీడియో తీసిన వ్యక్తిని అదే కాలేజీలో చదువుతున్న థర్డ్ ఇయర్ విద్యార్థి సిద్దార్థ్‌గా గుర్తించారు. బ్యాక్ లాగ్ రాసేందుకు వచ్చిన సమయంలో వాష్‌రూంలో మొబైల్ కెమెరా పెట్టినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి పోలీసులు వీడియోను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థుల స్టేట్‌మెంట్ రికార్డ్‌ను పోలీసులు రికార్డ్ చేశారు.

## నేడు ప్రజా భవన్‌లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం ప్రారంభం

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో ఆదివారం ఉదయం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరు కానున్నారు. అనంతరం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తంలో భాగంగా సివిల్స్ ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష అందించనున్నారు. సివిల్స్ మెయిన్స్ పరీక్షల్లో సత్తా చాటి ఇంటర్వ్యూలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు ఈ రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం ఆర్థికంగా తోడ్పడనుంది.

# చరిత్ర చెరిపితే చెరిగేది కాదు

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- 'అందరికీ అమ్మ' పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ అస్తిత్వ ప్రతీకగా ప్రజల హృదయాలలో స్వచ్ఛందంగా ప్రతిష్ఠించుకున్న తెలంగాణ తల్లి రూపాన్ని ఎవ్వరూ చెరిపేయ లేరని తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని స్వరాష్ట్ర ఉద్యమంలోనే రూపొందించబడిందని ఆయన చెప్పారు. ఎర్రవల్లి లోని కేసీఆర్ నివాసంలో శనివారం సాయంత్రం తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన 'అందరికీ అమ్మ' అన్న పుస్తకాన్ని కేసీఆర్ ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి రూపాన్ని గుండెల్లో దాచుకుని స్వరాష్ట్ర ఉద్యమం మహోగ్రంగా సాగిందన్నారు. తెలంగాణ తల్లి రూపం రాష్ట్ర సాధన ఉద్యమ ప్రతి అడుగులో, ప్రతి మలుపులో దారిచూపిన తల్లి రూపంగా నిలిచిందన్నారు.



స్వరాష్ట్రంలో కూడా సాంస్కృతిక ఉద్యమం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ తల్లులు ఎత్తిన బోనాలలో, బతుకమ్మలలో కోట్లాది మంది తల్లులు పాల్గొన్న వంటావార్పుల్లో సబ్బండ వర్ణాలు చేసిన ఉద్యమాల్లో గడప గడపకు తెలంగాణ తల్లి భావోద్వేగ రూపం ప్రతిష్ఠించబడిందని కేసీఆర్ చెప్పారు. చరిత్రను ఎవ్వరు చెరిపేయలేరని, చరిత్ర చెరిపితే చెరిగేది కాదని, చరిత్రే పాఠం చెబుతుందన్నారు. ఈ పుస్తకావిష్కరణలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, సునీత, శాసనమండలి సభ్యులు తాతామధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి దగా

- మాజీ మంత్రి హరీశ్‌రావు

బలగం టీవీ, హైదరాబాద్

రైతుబంధు కింద ఇచ్చే పెట్టుబడి సాయం పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతన్నను మరోసారి దగా చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఆరోపించారు. నమ్మించి గొంతు కోసిన రేవంత్ సర్కార్‌కు తెలంగాణ ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని అన్నారు. రైతు భరోసా కింద ఏటా ఎకరానికి రూ.15000 ఇస్తామని ఆశలు పెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు.

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడైతే రూ.10,000, మాకు ఓటేస్తే రూ.15,000 అని ఊరించిండు. నమ్మించి ఓట్లు కొల్లగొట్టి గద్దెనెక్కారు. గద్దెనెక్కినాక గద్దల్లాగా మారి రైతులను దారుణంగా వంచిస్తున్నారు. ఈరోజు జరిగిన క్యాబినెట్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆశలను అడియాసలు చేసింది. రైతు భరోసాను రైతు గుండె కోతగా మార్చారు%–% అని హరీశ్ రావు అన్నారు.



రైతు భరోసా కింద ఎకరానికి ప్రతి సీజన్‌లో ఎకరానికి రూ.7,500 చొప్పున ఇస్తామని చెప్పి, రూ.6,000లకు కుదించారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది పరాకాష్ట. మోసానికి పర్యాయపదం రేవంత్ రెడ్డి అనేది ఈరోజు నగ్నంగా బయటపడింది. కేసీఆర్ మానస పుత్రిక, ప్రపంచమే మెచ్చిన రైతుబంధు స్ఫూర్తికి వ్యతిరేకంగా ఈరోజు క్యాబినెట్ నిర్ణయాలు తీసుకుంది అని హరీశ్ రావు ధ్వజమెత్తారు. భూమి కలిగిన రైతులకే కాదు, కౌలు రైతులకు సైతం రెండు సీజన్లలో కలిపి ఎకరాకు రూ.15,000 పంట పెట్టుబడి సహాయం అందిస్తామని ప్రమాణం చేశారు. క్యాబినెట్ లో ఆ విషయమే చర్చించలేదు. కౌలు రైతుల గుండెలపై గుద్దారు. దారుణంగా ధోకాకు పాల్పడ్డారు. వానా కాలంలో ఎగ్గొట్టిన రైతు భరోసాను కూడా యాసంగితోపాటు కలిపి ఎకరానికి రూ.15,000 చొప్పున చెల్లించాలి అని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

రుణమాఫీ సగం మందికి ఎగ్గొట్టడం ద్వారా అదొక చిల్లర నాటకంగా మార్చేశారు. బోనస్ ఇస్తామన్న హామీ ఉత్త బోగస్ గానే మిగిలిపోయింది. పంట బీమా పత్తా లేకుండా పోయింది. తెలంగాణ రైతాంగం ఈ ద్రోహాన్ని క్షమించరు. నమ్మి ఓటేసిన పాపానికి పచ్చి మోసానికి పాల్పడ్డ కాంగ్రెస్ పార్టీకి తగిన సమయంలో బుద్ధి చెబుతారు%–% అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## హెచ్‌ఎంపివి వైరస్.. తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

బలగం టీవీ, హైదరాబాద్

చైనా లో వ్యాప్తి చెందుతున్న హెచ్ఎంపివి వైరస్ తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ వ్యాధి తెలంగాణలోకి రాకుండా తెలంగాణ వైద్య శాఖ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది.. శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల నుండి సురక్షితంగా ఉండటానికి కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. తెలంగాణ ఆరోగ్య శాఖ. రద్దీగా ఉండే ప్రదేశాలను నివారించాలని, సబ్బు లేదా శానిటైజర్‌తో చేతులను తరచుగా కడగాలని కోరింది. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయకూడదని, అనారోగ్యంగా ఉన్న వ్యక్తులు దగ్గరకి వెళ్లకూడదని అంటూ కొన్ని సూచించింది.. బయటకు వచ్చే సమయంలో మాస్క్ వాడటం మంచిదని పేర్కొంది.

# ఏపీలో గేమ్ చేంజర్ టికెట్ ధరలు పెంపునకు అనుమతి

**బెనిఫిట్ షో టికెట్ రూ.600...**

**మల్టీప్లెక్స్ లో రూ.175, సింగిల్ స్క్రీన్ పై రూ.135 వరకు పెంపు**

బలగం టీవీ, హైదరాబాద్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సౌతిండియా స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్ లో వస్తున్న చిత్రం గేమ్ చేంజర్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై రూపుదిద్దుకున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో, గేమ్ చేంజర్ టికెట్ ధరలు పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. బెనిఫిట్ షో టికెట్ రూ.600 చొప్పున విక్రయించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంటకు గేమ్ చేంజర్ బెనిఫిట్ షోలు వేయనున్నారు. ఈ నెల 10న ఆరు షోలకు అనుమతి ఇస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీప్లెక్స్ థియేటర్లలో టికెట్ పై అదనంగా రూ.175, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ పై అదనంగా రూ.135 వరకు పెంచుకోవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇవే ధరలతో జనవరి 11 నుంచి 23 వరకు రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు కూడా ఏపీ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది

# మళ్లీ దరఖాస్తులు ఎందుకు?

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

బలగం టీవీ, హైదరాబాద్

రైతుబంధు గురించి బీఆర్ఎస్ హయాంలో తీసుకున్న వివరాలు ఉండగా రైతు భరోసా కోసం కొత్తగా మళ్లీ దరఖాస్తులు ఎందుకని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. రైతు భరోసా కింద రైతులకు రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్... ఏడాది దాటినా అమలు చేయలేదన్నారు. డిసెంబర్‌లో ఇస్తాం... సంక్రాంతి తర్వాత ఇస్తామంటూ వాయిదా వేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్వీకరించిన ప్రజాపాలనలోనూ రైతు భరోసా దరఖాస్తులు ఉన్నాయని గుర్తు చేశారు. రైతు భరోసాను కాలయాపన చేసేందుకే ఇప్పుడు మరోసారి దరఖాస్తుల స్వీకరణ అంటున్నారని ఆరోపించారు. షరతుల పేరిట రైతులు తమ చేతిని తమ నెత్తిపైనే పెట్టుకునేలా ప్రభుత్వం చేస్తోందని ధ్వజమెత్తారు. రైతు భరోసాకు ఇన్ని ఆంక్షలు ఎందుకో చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అభయహస్తం కోసం దరఖాస్తులను స్వీకరించిందని... కానీ వాటిని కూడా అమలు చేయలేదన్నారు. రైతును యూనిట్‌గా తీసుకొని గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు రైతుబంధు ఇచ్చిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు ఎకరాలకే ఇచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు.

## 15న శబరిమలలో మకరజ్యోతి దర్శనం

బలగం టీవీ, హైదరాబాద్

ఈ ఏడాది శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 15 న నిర్వహించనున్న "మకరవిలక్కు" ( మకరజ్యోతి) దర్శనం పండగకు భారీ ఎత్తున శరవేగంగా ఏర్పాట్లు పూర్తికావచ్చాయని ఆలయ అధికారులు వెల్లడించారు . "శబరిమలకు వచ్చే ప్రతి భక్తుడు సులువుగా దర్శనం చేసుకుని తిరిగి క్షేమంగా వెళ్లాలన్న లక్షంతో ఏర్పాట్లు చేస్తున్నామని శబరిమల అడ్మినిస్ట్రేటివ్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ అరుణ్ ఎస్ నాయిర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతం రోజూ 90 వేల మంది కన్నా ఎక్కువ మంది భక్తులు శబరిమలకు వస్తుండటంతో విపరీతమైన రద్దీ ఉంటోందని, నాయిర్ చెప్పారు. ఈ మకరవిలక్కు పండగలో భాగంగా ఈనెల 12 న పందలం నుంచి 'తిరువాభరణం' ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. పండగ సజావుగా సాగేందుకు ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో పనిచేస్తున్నాయని. ఈనెల 10 నాటికి ఊరేగింపునకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తవుతాయని నాయిర్ ప్రకటనలో పేర్కొన్నారు. మకరవిలక్కు (మకరజ్యోతి) ని దర్శించడానికి భక్తులంతా ఎక్కువ భారీగా గుమికూడి ఉంటారో ఆయా ముఖ్యమైన ప్రదేశాల ఏర్పాట్లను పథనంపిట్ట జిల్లా కలెక్టర్ పరిశీలిస్తారని వివరించారు. గత డిసెంబర్ 30న శబరిమల అయ్యప్ప దేవాలయాన్ని తెరిచారు. మండల పూజ తరువాత డిసెంబర్ 26న మూసివేశారు. ఏటా జరిగే 41 రోజుల సుదీర్ఘయాత్రకు సంకేతంగా ముందుగా అవన్నీ పూర్తి చేశారు.

# కాంగ్రెస్ డీఎన్ఏలోనే మోసం

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు 'రుణమాఫీ' చెల్లిస్తామని 22 లక్షల మందికిపైగా రైతులకు ఎగ్గొట్టారు. రైతు సంక్షేమ ప్రభుత్వమంటే కోతలు విధించడమేనా? ఇందిరమ్మ పాలనంటే ఇచ్చిన మాట తప్పడమేనా? 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఏడాదిపాటు తూట్లు పొడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండో ఏడాదిలోనైనా వాటిని పూర్తిస్తాయిలో అమలు చేయకపోవడం అన్యాయం. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలనెల రూ. 2500, తులం బంగారం, స్కూటీ ఇస్తామని తెలంగాణ ఆడబిడ్డలను నిండా ముంచారు. వృద్ధులు, వితంతవులకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని చెబితే ఏడాదిగా ఎదురుచూస్తున్న అవ్వాతాతల నోట్లో మట్టికొట్టారు. రూ.5 లక్షల భరోసా కార్డు ఇస్తారని ఎదురు చూస్తున్న విద్యార్థులకు ఎగనామం పెట్టారు. నెలానెలా రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తారని, 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తారని ఎదురు చూస్తున్న నిరుద్యోగులను నడిరోడ్డున పడేశారు. ఇల్లులేని పేదలందరికీ జాగా తోపాటు రూ. 5 లక్షల చొప్పున ఆర్ధిక సాయం చేస్తామని హామీ ఇచ్చి పేదల బతుకులను బజారున పడేశారు అని చెప్పారు.

ఓట్ల కోసం అందరినీ వాడుకుని అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా సొమ్ము ఇవ్వాలి%–% అని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అతి త్వరలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జీ కిషన్ రెడ్డి నాయకత్వంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేసి కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచుతాం అని హెచ్చరించారు.

# నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

చెరుకు సాగుకు స్థానికంగా అనువైన పరిస్థితులు, చెరుకు పంటతో సమకూరే లాభాలు, అందుబాటులోకి వచ్చిన ఆధునిక యంత్ర పరికరాలు, అధిక దిగుబడిని అందించే వంగడాలు, సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు తదితర విషయాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, విజయ్ కుమార్ తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. వివిధ కారణాల వల్ల నిజాం షుగర్స్ 2015 నుంచి మూతపడగా, ఈ కర్మాగారాన్ని తిరిగి తెరిపించి క్రషింగ్ చేపట్టాలంటే ప్రతిరోజూ కనీసం 3500 మెట్రిక్ టన్నుల చెరుకు నిల్వలు అవసరం అవుతాయని అధికారులు అన్నారు. ఏడాదిలో 130 రోజుల వరకు గానుగ ఆడించాల్సి ఉంటుందని వివరించారు. అయితే, కనీసం 16 వేల నుంచి 18 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరుకు పంటను సాగు చేస్తే ఫ్యాక్టరీలో క్రషింగ్ జరపొచ్చన్నారు.

ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలతో పాటు సకాలంలో బిల్లుల చెల్లింపులపై స్పష్టమైన హామీ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం అందించే ఇన్సెంటివ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రోత్సాహకాన్ని జోడించి ఇవ్వాలని, డ్రిప్ పరికరాలు, హార్వెస్టర్లు, సోలార్ ఫెన్సింగ్, ఇతర ఆధునిక యంత్ర పరికరాలకు సబ్సిడీని వర్తింపజేయాలని ఈ సందర్భంగా రైతులు కోరారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అంధకారంలో గ్రామస్తులు..

- వీధి దీపాలు వెలిగేలా చేయాలని పంచాయతీ అధికారికి వినతిపత్రం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**



మండలం లోని టెక్స్టైల్ పార్క్ ఇందిరమ్మ కాలనీ గ్రామం సారంపల్లి ఫ్లాట్స్ కాలనీలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని రైజింగ్ స్టార్ యూత్ సభ్యులు గ్రామపంచాయతీ అధికారి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైజింగ్ స్టార్ యూత్ అధ్యక్షులు శ్రీరాముల రమేష్ చంద్ర మాట్లాడుత కార్మిక నిలయం అయినటువంటి ఇందిరమ్మ కాలనీ గ్రామం టెక్స్టైల్ పార్క్ లోని సారంపల్లి ఫ్లాట్స్ కాలనీలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగాక పోవడం వల్ల కాలనీలో పూర్తిగా చీకటి ఉండడంతో విషపూరిత పాములతో భయభ్రాంతులతో బిక్కుమంటున్నామని ప్రజల క్షేమం దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే వెంటనే స్ట్రీట్ లైట్ వెలిగేలా సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామపంచాయతీ కార్యదర్శి సెలవులో ఉండడం వల్ల సంబంధిత గ్రామ పంచాయతీ కారోబార్ రాజ మహేందర్ కి వినతి పత్రం అందజెశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండి వేణు, కారంపూరీ వినయ్, వంగ శ్రావణ్, కారంపూరీ ప్రశాంత్,ఎండీ సల్మాన్ ఖాన్, రమేష్ చంద్ర, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# నిత్య జీవనంలో ధ్యానం తప్పనిసరి

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**



తంగళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్ధులకు బ్రహ్మశ్రీ పితామహ పత్రిజి ఆశీస్సులతో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూవ్ మెంట్ వారు విద్యార్థులకు ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ధ్యానం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని ఆరోగ్యం, ఆనందం, ఆహ్లాదం , చక్కని భవిషత్తు ధ్యానం వల్ల పొందవచ్చని తెలియజేశారు. శాఖాహారం తినడం వల్ల మెరుగైన ఆరోగ్య జీవనం పెంపొందుతుంద ని ప్రతిరోజు ఒక గంట పాటు ధ్యానం చేయాలని సూచించారు. విద్యార్థులకు అనంతరం విద్యార్థులకు జ్ఞాన బోధన పుస్తకాలని అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య గౌడ్,వెంకటేశం,అఖిల,పావని,స్నేహ,సురేష్,రిషిక లు ప్రధానోపాధ్యాయులు శంకర్ నారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శివరాత్రి నాటికి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ప్రారంభించాలి..

- ఆధ్యాత్మిక పట్టణంగా వేములవాడ అభివృద్ధికి చర్యలు.
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**



ఆధ్యాత్మిక పట్టణంగా వేములవాడ అభివృద్ధి అయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి వేములవాడ ఆలయ అభివృద్ధి పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.

బద్ది పోచమ్మ ఆలయం రిన్నోవేషన్ పనులు, శివార్చన వేదిక నిర్మాణం, గుడి చెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి, వేములవాడ-కోరుట్ల, వేములవాడ వట్టెమ్లా రోడ్డు విస్తరణ పనులు, మూడవ బ్రిడ్జి నుంచి రాజేశ్వర స్వామి దేవాలయానికి రోడ్డు విస్తరణ పనులు, భక్తులకు ఆధునిక వస్తువుల కల్పన, అన్నదానం భవన్ నిర్మాణం, అంబేద్కర్ జంక్షన్, జయవరం లేఔట్ అభివృద్ధి వంటి సుమారు 199.49 కోట్ల విలువ గల పనులపై ప్రభుత్వ విప్ సమీక్షించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ కార్యాలయంలో సామాగ్రి ఫర్నిచర్ కొనుగోలు చేయమని సంవత్సరం క్రితం ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇప్పటి వరకు చేయలేదని ఆలయ అధికారుల పై మండిపడ్డారు. సంక్రాంతి నాటికి అన్నదాన భోజన హల్, సమావేశ మందిరంలో నూతన ఫర్నీచర్ అందుబాటులో తీసుకుని రావాలని అన్నారు. ఆలయం వద్ద భక్తుల వసతి కోసం సూట్ రూమ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. భక్తుల వసతి దగ్గర పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దోమలు వంటి సమస్యలు రాకుండా రెగ్యులర్ ఫాగ్గింగ్ జరగాలని అన్నారు.

బద్ది పోచమ్మ ఆలయం వద్ద బోనాలు, పట్నాల మండపాలు, వేయిటింగ్ హల్ నిర్మాణానికి 39 గుంటల భూమి సేకరించామని, 9 కోట్ల 90 లక్షలతో చేపట్టిన బద్ది పోచమ్మ రిన్నోవేషన్ పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని అన్నారు .

గుడి చెరువు విస్తరణ కోసం 34 ఎకరాల పట్టా భూమి సేకరించామని, 12 కోట్లతో గుడి చెరువు మిని ట్యాంక్ బండ్ అభివృద్ధి, ఫ్యామిలీ థియేటర్, విగ్రహం, నీటి సరఫరా, విద్యుత్ ,ల్యాండ్ స్కేపింగ్, వాకింగ్ ట్రాక్ పనులు శివరాత్రి కు ముందు ప్రారంభం కావాలని అన్నారు. ఒక తీరం వైపు భక్తులు స్నానం చేసేందుకు వీలుగా ఏర్పాట్లు ఉండాలని, అక్కడ బోటింగ్ సౌకర్యం కూడా మరో తీరం వైపు ఉండే విధంగా మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి జరగాలని అన్నారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించి త్వరిత గతిన పూర్తి చేయాలని, అక్కడ అంబెద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అన్నారు. శివార్చన వేదిక వద్ద అవసరమైన సామాగ్రి, ఇతర పనులు పూర్తిచేయాలని అన్నారు.

వేములవాడ- కోరుట్ల, వేములవాడ - వట్టేమ్లు కు 9 కోట్ల 95 లక్షలతో చేపట్టిన 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు శివరాత్రి నాటికి పూర్తి కావాలని ప్రభుత్వ విప్ ఆదేశించారు. మూల వాగు బ్రిడ్జి నుంచి దేవాలయం వరకు రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి కావాలని అన్నారు. ఆలయ విస్తరణ కు సంబంధించి డి.పి.ఆర్ పనులు నెలాఖరు నాటికి, అన్నదాన సత్ర భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే అందించాలని అన్నారు. వేములవాడ ఆధ్యాత్మిక శోభ తీసుకుని వచ్చేందుకు వీలుగా ఆలయం బయట ఉన్న గుడి చెరువు అభివృద్ధి, బద్దె పోచమ్మ, రోడ్డు విస్తరణ పనులు, జంక్షన్ అభివృద్ధి వంటి పనులు శివరాత్రి లోపు ప్రారంభం కావాలని, ఆలయం లోపల విస్తరణ పనులు శివరాత్రి తర్వాత ప్రారంభించేలా ప్రణాళిక తయారు చేయాలని అధికారల ను ఆదేశించారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ వేములవాడ దేవాలయం సంబంధించి సమావేశ మందిరం, భోజన హల్ లో అవసరమైన ఫర్నిచర్ కు వెంటనే షార్ట్ టెండర్ పిలిచి 3 రోజులలో కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు నెలల కాలంలో గుడి చెరువు దగ్గర చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వేములవాడ ఆర్డిఓ రాజేశ్వర్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, వేములవాడ దేవస్థానం అధికారులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుంది..

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ**



మెరుగైన విద్య, నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీయే లక్ష్యముగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శనివారం వేములవాడ పట్టణం లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ కాస్మోటిక్స్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏటా నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్న గత ప్రభుత్వాలు విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచలేదని,10 సంవత్సరాల తర్వాత ప్రజా ప్రభుత్వంలో కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచడం జరిగిందని అన్నారు.గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్సి ఎస్టీ బీసీ మైనారిటీ హాస్టల్ లలో బలమైన ఆహారాన్ని అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెల కామన్ డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు .రాష్ట్రంలో ఒక పండుగ వాతావరణం లో కామన్ డైట్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని,మన ఇంట్లో పిల్లలకు ఏ విదంగా ఆహారం అందిస్తున్నామో, ప్రజా ప్రభుత్వంలో గురుకులల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందజేయడం జరుగుతుందని అన్నారు.ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పిల్లలు దాగివున్న ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రోత్సాహం అందించాలని అన్నారు .రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తుందన్నారు..ప్రభుత్వం విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు తేవడం జరిగిందని గుణత్మకమైన విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అన్నారు. త్వరలోనే 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు .

ప్రజా ప్రభుత్వంలో గురుకులాల్లోని పిల్లలను తమ ఇంటి పిల్లలుగా భావించి వారికి పౌష్టికారమైన ఆహారం నాణ్యమైన భోజనం అంద చేయడం జరుగుతుందని అన్నారు .విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు..కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు 200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచామని అన్నారు.

గతంలో మూడు నుంచి ఏడవ తరగతి వరకు రూ. 950 డైట్ చార్జీలు ఉండగా, నేడు రూ. 1330గా ,8 నుంచి 10 వ తరగతి వరకు రూ.1100 ఉండగా నేడు రూ. 1540, ఇంటర్ నుండీ పీజీ వరకు రూ. 1500 ఉండగా నేడు రూ.2100 ప్రభుత్వం పెంచిందని అన్నారు .

గతంలో ఉన్న కాస్మోటిక్ చార్జీలను మూడు నుంచి ఏడవ తరగతి వరకు కాస్మోటిక్ చార్జీలు 55 ఉండగా నేడు 175గా ,8 నుండీ 10 వ తరగతి వరకు 75 ఉండగా నేడు 275 కు పెంచడం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు ..

# ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు నిర్వహించగలుగుతాం.

- నిత్యం యోగా సాధనతో ఆరోగ్యంపై పట్టుసాధించవచ్చు : ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టీవీ, సిరిసిల్ల**

నిరంతరం విధులు నిర్వహించే పోలీసులు నిత్యం యోగా సాధనతో తమ ఆరోగ్యంపై పట్టుసాధించవచ్చని, నిత్యజీవితంలో యోగ ఒక అలవాటుగా మార్చుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులకు,సిబ్బందికి పిలుపునిచ్చారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యోగా కార్యాక్రమాన్ని నిర్వహించి యోగా నిపుణులచే పోలీస్ అధికారులకు,సిబ్బందికి యోగాలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు విధినిర్వహణలో ఉండటం వలన తమ ఆరోగ్యం పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని ఆరోగ్యంపై అవగాహన ఎంతో ముఖ్యమని అన్నారు.సిబ్బంది,అధికారులు ఆరోగ్యం పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు దినచర్య, జీవన విధానం మిగతావారితో పూర్తి భిన్నంగా ఉంటుందని, ఇందుకుగానూ మన ఆరోగ్య పరిరక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకొనక తప్పదని అన్నారు.ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక,వ్యాయామం,యోగ వంటివి మన దినచర్యలో భాగం చేసుకోవాలని, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాధులు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయని వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తగిన ఆరోగ్య సూచనలు పాటిస్తే ఎంతో మంచిదని అన్నారు.ఈ కార్యక్రమములో అదనపు ఎస్పీ చంద్రయ్య,డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ లు మధుకర్, రమేష్, సిఐ లు మొగిలి,మధుకర్, శ్రీనివాస్,ఎస్ఐ లు ఆర్ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

# విహారయాత్రకు భారతి విద్యా నిలయం విద్యార్థులు..

**బలగం టీవీ, సిరిసిల్ల**



సిరిసిల్లలోని భారతి విద్యా నిలయం విద్యార్థులు పాఠశాల యాజమాన్య బృందం వరంగల్ జిల్లాలోని రామప్ప, వేయి స్తంభాల గుడి, భద్రకాళి గుడి, లక్నవరం చెరువు ల విహారయాత్రకు శనివారం వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాకర్ రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన, విహార యాత్రల వల్ల విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు,కాకతీయ కాలం నాటి చారిత్రక కట్టడాలు, ప్రాచీన శిల్ప కళ సంపదను, శాసనాలు, గుడులు, చెరువుల గురించి ప్రత్యక్ష అనుభవాన్ని విద్యార్థులకు కలిగించామని తెలియజేశారు.

# ఆస్ట్రేలియా ఆలౌట్.. భారత్‌కు ఆధిక్యం

- రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత స్కోరు 141/6
- 145 పరుగుల ముందంజలో టీమిండియా



**బలగం టీవీ, హైదరాబాద్**

సిడ్నీ టెస్టు రసవత్తరంగా మారింది. 9/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌటైంది. బ్యూ వెబ్‌స్టర్(105 బంతుల్లో 5 ఫోర్లతో 57) హాఫ్ సెంచరీతో రాణించగా.. స్టీవ్ స్మిత్(57 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 33) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్(3/51), ప్రసిధ్ కృష్ణ(3/42)లతో పాటు జస్‌ప్రీత్ బుమ్రా(2/33), నితీష్ కుమార్ రెడ్డి(2/32) రెండేసి వికెట్లు పడగొట్టారు. గాయంతో బుమ్రా మధ్యలోనే వెనుదిరిగినా.. సిరాజ్, ప్రసిధ్ అద్భుత ప్రదర్శన కనబర్చారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

రెండోరోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. ప్రస్తుతం భారత జట్టు 145 పరుగుల ఆధిక్యంలో ఉన్నది. సిడ్నీ టెస్టు రెండోరోజు ఇరుజట్లు కలిపి మొత్తం 313 పరుగులు చేయగా.. 15 వికెట్లు కోల్పోయాయి. రెండోరోజు ఆట ముగిసే సమయానికి రవీంద్ర జడేజా (8), వాషింగ్టన్ సుందర్ (6) పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు.

### భారత జట్టుకు శుభారంభం

రెండో ఇన్నింగ్స్‌లో భారత జట్టుకు శుభారంభం లభించింది. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ తొలి వికెట్‌కు 42 పరుగులు జోడించారు. రాహుల్ 13 పరుగులు, యశస్వి 22 పరుగుల వద్ద బోలాండ్‌కు పెవిలియన్‌కు చేరారు. ఆ తర్వాత శుభ్‌మన్ గిల్ 13 పరుగులు చేసి బ్యూ వెబ్‌స్టర్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఆఫ్ స్టంప్ వెలుపల వెళ్తున్న బంతిని వెంటాడే ప్రయత్నం విరాట్ కోహ్లీ మరోసారి స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. ఇక రిషబ్ పంత్ ధాటిగా బ్యాటింగ్ చేశాడు. పంత్ 33 బంతుల్లో ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్ల సహాయంతో 61 పరుగులు చేశాడు. ఇక నితీశ్‌రెడ్డి వరుసగా మూడో ఇన్నింగ్స్‌లోనూ విఫలమయ్యాడు. నాలుగు పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఆస్ట్రేలియా తరఫున బోలాండ్ ఇప్పటి వరకు నాలుగు వికెట్లు పడగొట్టగా.. కమిన్స్, వెబ్‌స్టర్‌లకు చెరో వికెట్ దక్కింది.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా ఆరు వికెట్లు కోల్పోయిన తర్వాత.. కెప్టెన్ బుమ్రా మైదానాన్ని వీడి స్కానింగ్ కోసం ఆసుపత్రికి చేరుకున్నాడు. బుమ్రా మైదానాన్ని వీడినా.. మిగతా ఫాస్ట్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి.. మిగతా నాలుగు వికెట్లను పడగొట్టారు. బుమ్రా గైర్హాజనరీలో కోహ్లీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో మూడు వికెట్లు తీయగా.. నితీశ్‌రెడ్డి, బుమ్రా రెండేసి వికెట్ల దక్కాయి.

ఆస్ట్రేలియా వికెట్ నష్టానికి తొమ్మిది పరుగుల వద్ద రెండోరోజు ఆటను ప్రారంభించింది. ఆ తర్వాత మరో 172 పరుగులు చేసి తొమ్మి వికెట్లను కోల్పోయింది. బుమ్రా మార్నస్ లాబుస్‌చగ్నే వికెట్ కీపర్ పంత్ చేతికి చిక్కాడు. 12వ ఓవర్‌లో శామ్ కాన్‌స్టాస్, ట్రావిస్ హెడ్‌లను సిరాజ్ పెవిలియన్‌కు పంపాడు. ఇక ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో కేఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి స్టీవ్ స్మిత్ అవుట్ అయ్యాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ కృష్ణ అలెక్స్ క్యారీని క్లీన్ బౌల్డ్ చేశాడు. బ్యూ వెబ్‌స్టర్ అరంగేట్రంలోనే హాఫ్ సెంచరీతో అలరించాడు. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాట్‌తో ఆకట్టుకోలేకపోయిన నితీశ్‌రెడ్డి.. బౌలింగ్‌లో రెండు వికెట్ల పడగొట్టాడు. అద్భుతంగా బౌలింగ్ చేసి రెండు వరుస బంతుల్లో కీలకమైన వికెట్లు తీశాడు. ఆస్ట్రేలియా 45 ఓవర్ చివరి బంతికి పాట్ కమిన్స్ స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. నితీశ్ వేసిన 47వ ఓవర్‌లో తొలి బంతికి మిచెల్ స్టార్క్.. రాహుల్ క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. నితిశ్ హ్యాట్రిక్ తుట్రిలో మిస్ అయ్యింది. 47వ ఓవర్‌లో రెండో బంతిని లియన్ లెగ్‌సైడ్ వైపు మళ్లించి.. ఖాతా తెరిచాడు. ఇక 166 పరుగుల వద్ద ఆస్ట్రేలియాకు 9వ దెబ్బ తగిలింది. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో బ్యూ వెబస్టార్.. యశస్వికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 105 బంతుల్లో ఐదు ఫోర్ల సహాయంతో 57 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఇక సిరాజ్ చివరగా బోలాండ్(9)ని క్లీన్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 181 పరుగుల వద్ద ముగిసింది.



# బుమ్రా రికార్డు

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో 47 ఏళ్ల రికార్డ్‌ను బుమ్రా అధిగమించాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో 32 వికెట్లు తీయడం ద్వారా బుమ్రా ఈ ఫీట్ సాధించాడు. సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఆఖరి టెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు తీయడం ద్వారా బుమ్రా ఈ ఘనతను అందుకున్నాడు. రెండో రోజు ఆట ఆరంభంలో మార్నస్ లబుషేన్ వికెట్ తీసి తన ఖాతాలో 32 వికెట్లు వేసుకున్నాడు. 1977-78లో ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో భారత మాజీ బౌలర్ బిషన్ సింగ్ బేడీ 31 వికెట్లు తీసాడు. ఇప్పటి వరకు ఇదే రికార్డ్‌గా ఉండగా.. తాజాగా బుమ్రా 32 వికెట్లు తీసి అధిగమించాడు. తొలి రోజు ఆటలో ఉస్మాన్ ఖవాజాను ఔట్ చేసిన బుమ్రా.. రెండో రోజు లబుషేన్‌ను ఔట్ చేశాడు.



## నన్నెవ్వరూ తప్పించలేదు..

- రోహిత్ శర్మ

**బలగం టీవీ, హైదరాబాద్**

తనను ఎవరూ తుది జట్టు నుంచి తప్పించలేదని, తానే స్వయంగా తప్పుకున్నానని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. రిటైర్మెంట్ ఆలోచనే లేదన్నాడు. రెండో రోజు ఆటలో భాగంగా రోహిత్ శర్మ.. అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడాడు.

'ఈ మ్యాచ్‌కు దూరమైనంత మాత్రానా రిటైర్మెంట్ ప్రకటిస్తానని కాదు. సుదీర్ఘ ఫార్మాట్‌కు దూరంగా ఉండాలనుకోవడం లేదు. కానీ బ్యాట్‌తో పరుగులు చేయలేకపోతున్నాను. అందుకే ఈ మ్యాచ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నాను. నేను పరుగులు చేయడానికి మరో 2 నెలలా? లేదా 5 నెలలా? సమయం పడుతుందా? అని గ్యారెంటీ ఇవ్వలేను. నేను ఇప్పటికే చాలా క్రికెట్ చూశాను. ప్రతి నిమిషం, ప్రతి సెకను, రోజువారీ జీవితంలో మార్పు ఉంటుంది. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని నేను నమ్ముతాను. కానీ అదే సమయంలో నేను కూడా వాస్తవికంగా ఉండాలి. కామెంటరీ బాక్స్‌లో కూర్చున్న వ్యక్తులు లేదా ల్యాప్‌టాప్‌లో కథనాలు రాసేవారు నా జీవితం ఎలా సాగుతుందో నిర్ణయించలేరు. నేను సుదీర్ఘకాలంగా క్రికెట్ ఆడుతున్నాను. నేను ఎప్పుడూ ఆడుతాను, ఎప్పుడు కెప్టెన్‌గా ఉంటాను, ఎప్పుడు తప్పుకుంటాను అనే విషయాన్ని ఎవరూ నిర్ణయించలేరు. నాకు కాస్త తెలివి ఉంది. పరిణితి కలిగిన వ్యక్తిని. ఇద్దరు పిల్లల తండ్రిని. నాకు బుర్ర ఉంది. నా జీవితంలో ఏం కావాలో నాకు తెలుసు.'అని రోహిత్ విమర్శకులపై అసహనం వ్యక్తం చేశాడు.

ఇక సిడ్నీ టెస్ట్ నుంచి విశ్రాంతి ఇచ్చారా? తప్పించారా? మీరే తప్పుకున్నారా? అని హోస్ట్ ప్రశ్నించగా.. 'ఈ మూడు కాదు. నేనే తప్పుకున్నాను. సెలెక్టర్లు, కోచ్‌లకు నేనే సమాచారమిచ్చాను. నా బ్యాట్ నుంచి పరుగులు రావడం లేదు. ఈ మ్యాచ్‌కు నేను దూరంగా ఉంటానని చెప్పాను. ఇది చాలా ముఖ్యమైన మ్యాచ్. నేను ఫామ్‌లో లేను. మనకు ఫామ్‌లో ఉన్న ఆటగాడు అవసరం. బ్యాటింగ్ ఆర్డర్ గొప్ప ఫామ్‌లో లేదు. కాబట్టి నేను తప్పుకోవడమే ఉత్తమమని కోచ్, సెలెక్టర్లకు వివరించాను.'అని రోహిత్ శర్మ తెలిపాడు.

# సినీ పరిశ్రమకు రాజకీయ రంగు పూయడం ఇష్టం లేదు



- ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్
- గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్

**బలగం టీవీ, రాజమండ్రి**

సినీ పరిశ్రమకు రాజకీయ రంగు పూయడం తమకు ఇష్టం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీ రాజమహేంద్రవరంలో నిర్వహించిన గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ముఖ్య అతిథిగా పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ...పవన్ కల్యాణ్, రామ్ చరణ్... మెగా ఫ్యామిలీ నుంచి ఏ హీరో ఉన్నా.. దానికి మూలం మెగాస్టార్ చిరంజీవి అన్నారు. తనను ఓజీ అనండి.. డిప్యూటీ సీఎం అనండి... అన్నింటికి ఆయనే ఆద్యుడు అన్నారు. తాను ఎప్పటికీ మూలాలు మర్చిపోనని తెలిపారు.

డిమాండ్ అండ్ సప్లై ఆధారంగానే టికెట్ ధరల పెంపు ఉంటుందని పవన్ కల్యాణ్ అన్నారు. డైరెక్టర్ శంకర్ సినిమాను తాను బ్లాక్‌లో టికెట్ కొని చూశానన్నారు. అలా టికెట్ కొనడం వల్ల ఆ డబ్బు వేరేవాళ్లకు వెళ్తోందన్నారు. ప్రభుత్వం టికెట్ ధరలు ఊరికే పెంచడం లేదని, టికెట్ ధరలు పెంచడం వల్ల జీఎస్టీ వస్తుందన్నారు. అది ప్రభుత్వానికి ఆదాయమే అన్నారు. చిత్ర పరిశ్రమకు రాజకీయ రంగు పులమడానికి తమకు ఇష్టం లేదని పవన్ అన్నారు. సినిమా టికెట్ల కోసం హీరోలు వెళ్లి ప్రభుత్వాధినేతలకు ఎందుకు దండాలు పెట్టాలని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. కావాలంటే నిర్మాతలు, యూనియన్లు మాట్లాడాలన్నారు. హీరోలు వచ్చి నమస్కారం పెట్టాలి అనుకునేంత తక్కువ స్థాయి వ్యక్తులం తాము కాదన్నారు. ఇది స్వర్గీయ నందమూరి ఎన్టీఆర్ దగ్గర నుంచి నేర్చుకున్నామన్నారు.

గతంలో తన సినిమాలకు టికెట్ ధరలు పెంచకపోగా, తగ్గించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వానికి సినీ నటులు అందరూ మద్దతు తెలపలేదని, అయినా తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. హీరోలతో నమస్కారాలు పెట్టించుకునే వ్యక్తులం తాము కాదన్నారు. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ అని కాదని, భారతీయ చిత్ర పరిశ్రమ అనేదే మన నినాదం అన్నారు. మన జాతి ప్రాముఖ్యతను సినిమాల ద్వారా ప్రపంచానికి తెలియజేయా లన్నారు. చిత్ర పరిశ్రమలో క్రమశిక్షణ రావాలని కోరారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమ గురించి మాట్లాడాలంటే సినిమా లు తీసే వాళ్లే మాట్లాడాలన్నారు. సినిమాలు తీసే వాళ్లతోనే తాము మాట్లాడుతామన్నారు. సినిమా టికెట్ ధరల విషయం లో హీరోలతో పనేంటి? నిర్మాతలు చర్చించాలన్నారు. హీరోల తో దండాలు పెట్టించుకునేంత కిందిస్థాయి వ్యక్తులం కాదన్నారు.

సీఎం చంద్రబాబు తెలుగు సినీ పరిశ్రమను ఎప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉంటారని పవన్ కల్యాణ్ తెలిపారు. సినిమా మంచి, చెడు రెండింటినీ చూపిస్తుందన్నారు. ఏది తీసుకోవాలో ప్రేక్షకుల ఇష్టం అన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా సినిమాలు తీయాలని కోరారు. నిజ జీవితంలోని సంఘటనలు సినిమా ప్రపంచంలో స్ఫూర్తిని స్తాయన్నారు. కేవలం డబ్బులు సంపాదించడం మాత్రమే కాదని, విలువలు నేర్పించాలన్నారు. ఏపీలో స్టూడియోలు నిర్మించాలని, యువతకు తగిన శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కారోరు. తెలుగు చిత్ర పరిశ్రమ అంటే తెలంగాణ, ఏపీ అన్నారు. ఏపీ యువతలోని శక్తిని సినీ పరిశ్రమ వినియోగించుకోవాలని కోరారు. ఏపీలో స్టంట్ స్కూల్స్, స్టూడియోలు ఏర్పాటు చేయాలన్నారు. 24 క్రాఫ్ట్‌లకు సంబంధించిన విషయాలు నేర్పించాలన్నారు.

శంకర్ తెలుగులో సినిమా తీస్తే బాగుంటుంది అనుకునేవాడినని.. ఇప్పుడు గేమ్ ఛేంజర్ చిత్రాన్ని తెరకెక్కించడం ఆనందంగా ఉందన్నారు. తాను బాగా కష్టాల్లో ఉన్నప్పుడు.. తన వద్ద డబ్బులు లేనప్పుడు నాకు డబ్బులు ఇచ్చి వకీల్ సాబ్ సినిమా చేశారని.. ఆ డబ్బే నాకు జనసేన పార్టీకి ఇంధనంగా పని చేసిందన్నారు. ఇంటర్ చదివే సమయంలో అన్నయ్యకు అబ్బాయి పుట్టాడని.. మా ఇంట్లో హనుమంతుడి భక్తులు కాబట్టి రాముడి చరణాల కింద ఉంటాడని.. కాబట్టి రామ్ చరణ్ అని మా నాన్న పెట్టారన్నారు. చిరంజీవి నాకు అన్నయ్య మాత్రమే కాదని.. తండ్రి సమానుడని వ్యాఖ్యానించారు. చిన్నప్పుడు తనను బాగా ఏడిపించేవాడినని గుర్తు చేసుకున్నారు. చరణ్ అద్భుతమైన డ్యాన్సర్ అని.. రంగస్థలం సినిమాలో నటన చూసి బెస్ట్ యాక్టర్ అవార్డు రావాలని అనిపించిందని.. భవిష్యత్తులో ఉత్తమ నటుడు అవార్డు అందుకుంటాడన్నారు. తండ్రి మెగాస్టార్ అయితే కొడుకు గ్లోబల్ స్టార్ అయ్యాడని సంతోషం వ్యక్తం చేశారు.